క్లుప్తంగా

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ సిబ్బంది

సాలూరు: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ కృష్ణారావు అన్నారు. ఈ మేరకు ప్రపంచ మలేరియా నివారణ దినం సందర్భంగా కమిషనర్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం నుంచి బోసుబొమ్మ జంక్షన్ వరకు శుక్రవారం ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేసి, మానవహారంగా రూపొందారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో లార్వా వృద్ధి చెందుతుందని, ఫ్రైడే డ్రైడే పాటిస్తూ నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని హితవు పలికారు. ప్రజల ఆరోగ్యం పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ప్రజలు చెత్తను ఆరుబయట విసరకుండా, మున్సిపల్ కార్మికులకు అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో మలేరియా సబ్‌యూనిట్ అధికారి ఈశ్వరరావు, ఇన్‌చార్జ్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాజీవ్, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తి ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

- మండల ప్రత్యేకాధికారి రాజేశ్వరి



మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి రాజేశ్వరి

సీతానగరం: మండలంలోని కాలనీల్లో మంజూరుచేసిన ఇళ్లలో అసంపూర్తిగా నిలిచిపోయిన వాటిని పూర్తి చేయడానికి గృహనిర్మాణశాఖ అధికార సిబ్బంది అవసరమైన చర్యలు తీసుకోవాలని మండల ప్రత్యేకాధికారి, జిల్లా పౌరసరఫరాల అధికారి రాజేశ్వరి అన్నారు. ఈ మేరకు గెడ్డలుప్పి కాలనీలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలను శుక్రవారం ఆమె ఎంపీడీఓతో పాటు శాఖ అధికార సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో ఆర్థిక పరిస్థితుల కారణంగా అసంపూర్తిగా ఉన్న నిర్మాణాలు పూర్తి చేయడానికి ప్రభుత్వం అదనంగా ఆర్థిక సహాయం అందిస్తుందని, ఈ అవకాశాన్ని లబ్ధిదారులు వినియోగించుకుని ఇళ్లనిర్మాణాలను పూర్తిచేసి సొంత గూడు ఏర్పాటు చేసుకోవాలని పిలుపు నిచ్చారు.

కేఎస్‌పురం ఆలయాలకు మంచినీటి సౌకర్యం



బోరు ప్రారంభిస్తున్న ఎంపీటీసీ యాళ్ల అరుణకుమారి

సీతానగరం: మండలంలోని కోటసీతారాంపురం గ్రామస్తుల కోరిక మేరకు రామాలయం, శివాలయం ఆవరణలో భక్తులకు మంచినీరు సౌకర్యం కల్పించేందుకు మండల పరిషత్ నిధుల నుంచి రెండు బోర్ల నిర్మాణం పూర్తి చేశామని ఎంపీటీసీ యాళ్ల అరుణకుమారి తెలిపారు. ఎంపీపీ బి.రమణమ్మ సూచనల మేరకు మండల పరిషత్ నిధులతో కేఎస్ పురంలో తీయించిన బోర్లను వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు వై.వెంకటనాయుడితో కలిసి శుక్రవారం ఆమె ప్రారంభించారు.

53 మందిపై బైండోవర్ కేసులు

సీతంపేట: నవోదయం 2.0లో భాగంగా సారా కేసుల్లో పాత ముద్దాయిలు 53 మందిపై బైండోవర్ కేసులు పెట్టినట్టు పాలకొండ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ కె.సూర్యకుమారి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో వీరిని హాజరుపరిచినట్లు చెప్పారు. సారా తయారు చేసినా, విక్రయించినా చర్యలు తప్పవన్నారు.

ప్రైవేటు పాఠశాలల్లో ఫ్రీ సీట్లకు దరఖాస్తు చేసుకోండి

గరుగుబిల్లి: ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం సీట్లకు అర్హులైన నిరుపేద విద్యార్థులంతా దరఖాస్తు చేసుకోవాలని ఎంఈవో దత్తి అప్పలనాయుడు ఓ ప్రకటనలో శుక్రవారం కోరారు. విద్యాహక్కు చట్టం ప్రకారం 2025–26 విద్యా సంవత్సరానికి గాను ఒకటో తరగతిలో ప్రవేశం పొందే విద్యార్థికి పట్టణ ప్రాంతాల్లో రూ.8,500లు, గ్రామీణ ప్రాంతాల్లో రూ.7,500లు, ఏజెన్సీ ప్రాంతాల్లో రూ.5,500లను నిర్దిష్ట ఫీజుగా నిర్ణయించడం జరిగిందని, ఉచిత సీట్లు పొందే వారి ఫీజులను ప్రభుత్వమే చెల్లిస్తుందన్నారు. ఐదేళ్ల వయసు నిండిన చిన్నారులంతా ఈ నెల 28వ తేదీ నుంచి మే 15వ తేదీ వరకు సీఎస్ఇ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌ను సంప్రదించి, దరఖాస్తు చేసుకోవాలన్నారు.

కొమ్మలు అడ్డం వస్తే.. చెట్ల నరికివేత

- విద్యుత్ శాఖ సిబ్బంది నిర్వాకం





పార్వతీపురం-నర్సిపురం రహదారి పరిధిలో నరికివేసిన చెట్లు

పార్వతీపురం రూరల్: మండలంలోని విద్యుత్ శాఖసిబ్బంది వింతపోకడలకు పోతున్నారు. విద్యుత్ తీగలకు చెట్ల కొమ్మలు అడ్డం వస్తున్నాయని ఏకంగా చెట్లనే నరికేసి పర్యావరణానికి విఘాతం కలిగిస్తున్నారు. పార్వతీపురం శివారు ప్రాంతం నుంచి నర్సిపురం వరకు విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి నూతనంగా లైన్లు చేసే క్రమంలో పనులకు ఆటంకం లేకుండా చెట్ల కొమ్మలను నరకాల్సి ఉండగా ఏకంగా దాదాపు 12చోట్ల చెట్ల మొదళ్ల వరకు నరికి పెద్దచెట్లను సైతం నేలమట్టం చేసి అవి మళ్లీ పెరిగే అవకాశం లేని విధంగా చేస్తున్నారు. ప్రభుత్వం చేపట్టిన పలు కార్యక్రమాల ద్వారా రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటి చెట్ల పెంపకానికి ప్రోత్సహిస్తే ఈ విధంగా ఉన్న విద్యుత్ శాఖ సిబ్బంది తీరుపట్ల స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుకు ఇరువైపులా రాకపోకలు సాగించేవారికి నీడనిచ్చే చెట్లను ఎందుకు ఇలా నరికివేస్తున్నారో అర్థం కావడం లేదని స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్‌శాఖ పనులకు, విద్యుత్ సరఫరాకు అంతరాయమైతే ఆ మేరకు కొమ్మలను తొలగించాల్సింది పోయి చెట్ల మొదళ్ల వరకు తొలగిస్తే ఆ చెట్లు చనిపోయే పరిస్థితి ఏర్పడుతుందని స్థానికులు వాపోతున్నారు. నర్సిపురం గ్రామంలో విద్యుత్ తీగలకు అంతరాయం లేకుండా కొమ్మలు తొలగించి ఎక్కడివక్కడే వదిలివేశారు. దీంతో తొలగించిన కొమ్మలు ఇళ్లపైన, షాపుల చుట్టూ పడిపోడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై ఆర్అండ్‌బీ కార్యాలయానికి వెళ్లినా, ఫోన్ ద్వారా సంప్రదించినా సంబంధిత అధికారులు స్పందించలేదు.



నర్సిపురంలో షాపు, ఇళ్లు పరిసరాల్లో తొలగించి వదిలేసిన చెట్లకొమ్మలు

కొమ్మలనే తొలగించాలని చెప్పాం

ఇటీవల చేపట్టిన విద్యుత్ స్తంభాలు, లైన్ల ఏర్పాటులో అవసరమైన మేరకు చెట్లకొమ్మలను మాత్రమే తొలగించాలని కాంట్రాక్టర్లకు తెలియజేశాం. సిబ్బంది కొమ్మలతో పాటు చెట్లను కూడా తొలగించినట్లు మా దృష్టికి రాలేదు. పరిశీలించి చర్యలు చేపడతాం.

– లక్ష్మీనారాయణ, విద్యుత్‌శాఖ కన్‌స్ట్రక్షన్ ఎ.డి

సమాచారం లేదు.. మాకు సంబంధం లేదు.

నర్సిపురం పరిధిలో విద్యుత్‌శాఖ సిబ్బంది విద్యుత్ శాఖపరమైన పనుల నిమిత్తం చెట్ల కొమ్మలు, చెట్ల నరికివేతపై మాకు ఎలాంటి ముందస్తు సమాచారం లేదు. అలాగే ఈ విషయం ఆర్అండ్‌బీ శాఖ పరిధిలోకి వస్తుంది. విద్యుత్‌శాఖాధికారుల ఒప్పందంపై వచ్చిన కాంట్రాక్టర్లు చెట్ల కొమ్మలు తొలగించే పనులు చేస్తున్నారు. చెట్లు తొలగించిన చోట ముందే మొక్కలు నాటాల్సిన పరిస్థితి ఉంది. గ్రామ పంచాయతీని సంప్రదిస్తే చెట్లు తొలగించకుండా అవసరమైన మేరకు కొమ్మలు తొలగించే ప్రయత్నాలు జరిగేవి.

అంపోలు కూర్మారావు, పంచాయతీ కార్యదర్శి, నర్సిపురం

ప్రభుత్వ కాలేజీలో ప్రవేశాలకు ప్రచారం



పెదభోగిలిలో విద్యార్థి నుంచి అంగీకార పత్రం తీసుకుంటున్న అధ్యాపకులు

సీతానగరం: మండలకేంద్రంలో విద్యాబోధనకు అవసరమైన మౌలిక వసతులున్న ప్రభుత్వ జూనియర్ కాలేజీలో టెన్త్ పాసైన విద్యార్థులు ప్రవేశించాలని కోరుతూ ప్రచారం చేస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎల్. దాలినాయుడు అన్నారు. ఈ మేరకు మండలంలోని పెదభోగిలి, బూర్జ, లక్ష్మీపురం, వెంకటాపురం, చెల్లంనాయుడువలస గ్రామాల్లో అధ్యాపకులతో కలిసి శుక్రవారం ఆయన ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టెన్త్ క్లాస్ పరీక్షల ఫలితాలు రావడంతో విద్యార్థులంతా రాకపోకలకు, విద్యాబోధన, మౌలిక సదుపాయాలతో క్రీడామైదానం, ల్యాబ్ వంటి సదుపాయాలున్న ప్రభుత్వ జూనియర్ కాలేజీలో చేరాలని కోరారు.కాలేజీలో జనరల్ కోర్సులతో పాటు వృత్తివిద్యా కోర్సులున్నాయని తెలియజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు దాసరి రామకృష్ణ, అల్లాడ రామారావు, ఎస్. సత్యనారాయణ సిబ్బంది పాల్గొన్నారు.

జీడిపిక్కల కొనుగోళ్లు ఇప్పుడా?



చిన్నారావు

గుమ్మలక్ష్మీపురం: వీడీవీకే(వన్ ధన్ వికాస్ కేంద్రం) ద్వారా జీడిపిక్కల కొనుగోళ్ల విడ్డూరంగా ఉందని, దొంగలు పడ్డ ఆరు నెలలకు అన్నట్లుగా ప్రభుత్వం, ప్రభుత్వాధికారుల తీరు ఉందని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కో–ఆర్డినేటర్ అడ్డాకుల చిన్నారావు విమర్శించారు. జిల్లాలో గిరిజనులు విస్తారంగా సాగు చేసే జీడిమామిడి పంట కోత(ఏరివేత) జరిగి, పంట కూడా అమ్మేసుకున్నారని, ఇప్పుడు కొనుగోళ్ల ప్రక్రియ ప్రారంభించడం వెనక ఉద్దేశమేంటని ప్రశ్నించారు. నష్టానికి అమ్ముకున్న తర్వాత ఇప్పుడు కొనుగోళ్ల ప్రక్రియ చేపట్టడం ఎంతవరకు సమంజసమన్నారు. ఏటా మన్యంలో ప్రభుత్వమే జీడిపంట కొనుగోలు చేయాలని కోరడం జరుగుతోందని, మార్చి మొదటి వారంలో కొనుగోలు చేయాల్సి ఉండగా పంట చివరిలో ఏప్రిల్ నెలలో కొనుగోళ్లు ఏంటని నిలదీశారు. గిరిజన రైతులపై ప్రభుత్వం, ప్రభుత్వాధికారులు చూపే 'సవతి తల్లి' ప్రేమకు పరాకాష్ఠ ఇది అని అనక తప్పదన్నారు.

కూటమి నాయకులకే గోశాలలా?

కొమరాడ: కూటమి నాయకులకు ఒక్కరికే గోశాలలు మంజూరు చేయడంపై విక్రంపురం రైతులు పుర్రి తాతబాబు, గర్బాపు జగన్నాథం తదితరులు మండిపడుతున్నారు. వాస్తవానికి పశువులు ఉన్న రైతులకు గోశాలలు ఇవ్వాలని ప్రభుత్వం చెబితే మండలంలోని కూటమి పార్టీల నాయకులు మాత్రం వారి పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలకే గోశాలలు కట్టబెట్టారని ఆరోపించారు.

పశువులు కలిగిన తాము గోశాలల కోసం దరఖాస్తు చేసుకున్నా రాలేదని, టీడీపీ నాయకులు మాత్రం తమ బైకులు, కార్లు పెట్టుకునేందుకు గోశాలలు మంజూరు చేసుకుని నిర్మాణం చేసుకున్నారన్నారు.

అలాగే కొమరాడలో పశువైద్యుడు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని, గోశాల కావాలని వెళ్తే కూటమి నాయకుల సిఫార్సులు అడుగుతున్నారన్నారు. అధికారులు స్పందించి, అర్హులకే గోశాలలు మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

న్యాయం చేయాలి..



నిరసన తెలియజేస్తున్న మినిస్టీరియల్ ఉద్యోగులు

పాలకొండ రూరల్: ఏపీ మినిస్టీరియల్ ఉద్యోగులకు న్యాయం చేయాలని ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు కిల్లారి నారాయణరావు కోరారు. ఎంపీడీఓ పదోన్నతుల సమయంలో పంచాయతీరాజ్ పరిపాలాధికారులకు (ఏఓ) 34, విస్తరణాధికారులకు 33, గ్రూప్–1 ద్వారా వచ్చిన వారికి 3 శాతం రిజర్వేషన్లు ఉండేవన్నారు. అయితే తాజాగా విడుదల చేసిన జీఓ 35 వల్ల తమకు నష్టం కలుగుతుందని చెప్పారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తంచేశారు. కార్యక్రమంలో సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.నరసింహులు, అసోసియేట్ అధ్యక్షుడు బీవీఆర్ ప్రసాద్, ఎంపీడీఓ రంగారావుతో పాటు డివిజన్ పరిధిలోని 8 మండలాల సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

రేగిడి: మండలంలోని సోమరాజుపేట, అంబఖండి గ్రామాల్లోని రైతులకు ప్రకృతి వ్యవసాయంపై శుక్రవారం అవగాహన కల్పించారు. ప్రకృతి సేద్యం దాని వల్ల కలిగే ప్రయోజనాలను ప్రకృతి వ్యవసాయం యూనిట్ ఇన్‌చార్జ్ నాగరాజు వివరించారు. అనంతరం జీల్లేడు, పత్ర ద్రావణాలు, తూటాకు కషాయం తయారీని ప్రయోగాత్మకంగా వివరించి, చూపారు. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు, ఆరోగ్యవంతమైన పంటలు తెచ్చిపెట్టే ప్రకృతి సాగును రైతులు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఐసీఆర్‌పీలు లక్షుంనాయుడు, వరలక్ష్మి, రవి పాల్గొన్నారు.

రేగిడి: మండలంలోని చిన్నకోడిశ గ్రామంలో రెడ్డీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నెల్లి నారాయణరావు అనే రైతు పొలంలో ఫెర్టి కమ్ సీడ్ డ్రిల్ యంత్రం ద్వారా వరి వెదలు వేయడం(విత్తనాలు నాటడం)పై శుక్రవారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రెడ్డీస్ ఫౌండేషన్ ఏరియా మేనేజర్ బి.లక్ష్మీనరసింహమూర్తి, సమన్వయకర్త శరత్‌బాబు పాల్గొన్నారు.

అధికార దర్పం

పార్వతీపురం రూరల్: గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని, గృహాలను నిర్మించుకొనే వారికి అదనంగా ప్రభుత్వం ప్రోత్సాహకం అందిస్తుందని మండల ప్రత్యేకాధికారి, డీఆర్‌డీఏ పీడీ ఎం. సుధారాణి గృహనిర్మాణ లబ్ధిదారులకు సూచించారు. శుక్రవారం మండలంలోని కృష్ణపల్లి గ్రామంలో నిర్మాణంలో ఉన్న గృహ నిర్మాణాలను ఆమె పరిశీలించి లబ్ధిదారులకు పలు సూచనలు చేసి నిర్మాణాలను వేగవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేకాధికారి పరిశీలన సమయంలో ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని దిగువ స్థాయి సిబ్బంది గొడుగుపట్టి తమ విధేయతను చాటుకున్నారు. దిగువస్థాయి సిబ్బంది సేవలను వినియోగించుకొని అధికార దర్పం ప్రదర్శించడంపై స్థానికులు విమర్శలు గుప్పిస్తున్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



ర్యాలీలో సచివాలయ సిబ్బంది, ఆశ కార్యకర్తలు

గరుగుబిల్లి: ఫ్రైడే డ్రైడేలో భాగంగా మండలంలోని ఉల్లిబద్ర గ్రామంలో పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తూ సచివాలయ సిబ్బంది, ఆశ కార్యకర్తలు శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని ఈవోపీఆర్‌డీ ఎల్.గోపాలరావు సూచించారు. కాలువల్లో చెత్తాచెదారం వేయకుండా చూడాలన్నారు. అనంతరం దోమల వ్యాప్తిని అరికడదాం..ప్రజారోగ్యాన్ని రక్షించుకుందామని నినాదాలు చేశారు.

నేడు డీఎస్సీ అభ్యర్థులతో సమావేశం

గుమ్మలక్ష్మీపురం: పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టరు కార్యాలయం వద్ద గిరిజన డీఎస్సీ అభ్యర్థులతో శనివారం సమావేశం నిర్వహిస్తున్నట్లు గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తాడంగి సాయిబాబు, పాలక రంజిత్‌కుమార్‌లు ఓ ప్రకటనలో శుక్రవారం తెలిపారు. ఉదయం 10 గంటలకు అభ్యర్థులంతా సమావేశానికి హాజరుకావాలన్నారు. ఆదివాసీల ప్రత్యేక డీఎస్సీ, ప్రస్తుత డీఎస్సీలో అభ్యర్థుల వయోపరిమితి పెంపు, పరీక్షకు ఇచ్చిన గడువు పెంపు తదితర అంశాలపై సమావేశంలో చర్చించనున్నట్లు పేర్కొన్నారు.

దుప్పట్లు, దోమతెరల పంపిణీ

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రంలోని పలువురు నిరుపేదలకు పార్వతీపురం మన్యం జిల్లా రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో దుప్పట్లు, దోమతెరలు శుక్రవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి చేతులమీదుగా 40 మందికి దోమతెరలు, దుప్పట్లు అందజేశారు. రెడ్‌క్రాస్ సొసైటీ సేవా కార్యక్రమాలు అభినందనీయమని ఎమ్మెల్యే ప్రశంసించారు. కార్యక్రమంలో జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ అధ్యక్షుడు మంచిపల్లి శ్రీరాములు, కురుపాం ఏఎంసీ చైర్మన్ కె.కళావతి తదితరులు పాల్గొన్నారు.

కార్మిక చట్టాలు పకడ్బందీగా అమలుచేయాలి



సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న జ్యోతిలక్ష్మి

- ప్రజాసంఘాల నాయకురాలు జ్యోతిలక్ష్మి

బలిజిపేట: కార్మిక చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని, లేబర్ కోడ్‌లు రద్దుచేయాలని ప్రజాసంఘాల నాయకురాలు జ్యోతిలక్ష్మి డిమాండ్ చేశారు. ఈ మేరకు బలిజిపేట సీఐటీయూ కార్యాలయంలో కార్మికుల సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మేడేను, మే 20వతేదీ దేశవ్యాప్తంగా జరగబోయే సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వం పారిశ్రామిక అధిపతులు, దోపిడీ వర్గాలకు కొమ్ము కాసి కార్మికుల శ్రమను దోచుకుంటోందన్నారు. పనిగంటలు పెంచడం, సంఘాల ప్రాధాన్యం తగ్గించి మాజమాన్యాలకు హక్కులు సులభతరం చేయడం వంటివాటిని ప్రోత్సహిస్తోందని ఆరోపించారు. కార్మిక చట్టాలు, హక్కులు ఈఎస్ఐ, ఇన్సూరెన్స్ ఉద్యోగ భద్రత, సమాన పనికి సమాన వేతనం సాధించడం కోసం, మోడీ అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలు, లేబర్ కోడ్ రద్దు చేసి కార్మికులకు కనీస వేతనాల అమలుచేయాలని డిమాండ్ చేస్తూ మేనెల 20న నిర్వహించనున్న సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. మేడే వేడుకను ఘనంగా నిర్వహించుకోవాలని కోరారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు అనేక హామీలు ఇచ్చిందని నేడు వాటి గురించి చర్చించకుండా ముఖ్యమంత్రి సంపద సృష్టి పేరుతో కాలయాపన చేస్తున్నారని దుయ్యబట్టారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మన్మథరావు, కార్మికులు పాల్గొన్నారు.

ఉగ్రదాడికి నిరసన



బలిజిపేటలో నిరసన తెలుపుతున్న మహిళలు



సీతానగరం: జోగింపేటలో సానుభూతి తెలియజేస్తున్న విద్యార్థులు



సీతానగరం: ర్యాలీ చేస్తున్న ప్రజలు



సీతానగరం: సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికుల ర్యాలీ



పార్వతీపురం: నిరసన తెలుపుతున్న జనసేన పార్టీ నాయకులు

బలిజిపేట: జమ్ముకశ్మీర్‌లో జరిగిన ఉగ్రదాడిని నిరసిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో మహిళలు బలిజిపేటలో శుక్రవారం నిరసన తెలిపి దాడుల్లో మరణించిన వారికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మన్మథరావు మాట్లాడుతూ ఉగ్రదాడిని ప్రతి ఒక్కరూ ఖండించాలని కోరారు. ఉగ్రవాద కార్యకలాపాలు పెచ్చుమీరాయని, బీజేపీ ప్రభుత్వం ఉగ్రవాద నిర్మూలనలో విఫలమైందని విమర్శించారు. ఇప్పటికైనా ఉగ్రవాద నిర్మూలనకు, దేశభద్రతకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు సావిత్రి, లక్ష్మి, అనూరాధ, ప్రమీల, శారద పాల్గొన్నారు.

సీతానగరంలో..

సీతానగరం: జమ్ముకశ్మీరులో ఉగ్రవాద ముష్కరుల చేతిలో అమరులైన భారతదేశ టూరిస్ట్‌లకు, వారి కుటుంబాలకు ప్రఘాడ సానుభూతిని తెలియజేయాల్సిన అవసరం మనందరిపై ఉందని సీతానగరం పట్టణ ప్రముఖులు అన్నారు. ఈ మేరకు శుక్రవారం రాత్రి కాగడాలతో జోగింపేట, సీతానగరం మండల కేంద్రంలో వందలాది మందితో ర్యాలీ చేశారు. అలాగే సీఐటీయూ ఆధ్వర్యంలో మండలకేంద్రంలో ర్యాలీ జరిగింది.

ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలి

సాలూరు: ఉగ్రవాదులను ఏరివేయడంలో కేంద్రం ఉదాసీనంగా కాకుండా కఠినంగా వ్యవహరించి బాధ్యులను శిక్షించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎన్‌వైనాయుడు కోరారు. జమ్ముకశ్మీర్‌లో ఉగ్రదాడుల్లో అమరులైన మృతులకు కొవ్వొత్తులు వెలిగించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జమ్ముకశ్మీర్‌లో భద్రత పెంచాలని, అక్కడ ఉపాధి కోల్పోయిన పర్యాటక కార్మికులందరినీ ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

మలేరియాపై అప్రమత్తంగా ఉందాం



బలిజిపేటలో ర్యాలీ చేస్తున్న వైద్యశాఖ

బలిజిపేట: మలేరియా వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని బలిజిపేట పీహెచ్‌సీ వైద్యాధికారిణి క్రాంతి కిరణ్మయి అన్నారు. 'ప్రపంచ మలేరియా నివారణ దినం' సందర్భంగా బలిజిపేట, అరసాడ పీహెచ్‌సీల పరిధిలో శుక్రవారం ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా బలిజిపేట పీహెచ్‌సీ వైద్యాధికారిణి కిరణ్మయి మాట్లాడుతూ దోమ పుట్టరాదు–కుట్టరాదు, నెట్ కట్టు–దోమ ఫట్, పరిసరాల శుభ్రత–ఆరోగ్యానికి భద్రత, చేయి చేయి కలుపుదాం–డెంగీ, మలేరియాలను నిర్మూలిద్దాం, చిన్న ప్రాణులు–పెద్ద ప్రమాదాలు, మన ఆరోగ్యం–మన చేతుల్లోనే ఉంది, దోమ తెరలు వాడండి–దోమ కాటు నివారించండి, ప్రతి శుక్రవారం–డ్రైడే పాటిద్దాం, వేపాకు పొగ–దోమలకు సెగ, దోమకాటు వద్దు–దోమతెరే ముద్దు అనే నినాదాలు వినిపించారు. అరసాడలో వైద్యాధికారిణి ఎం.శివగాయిత్రి ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ సత్యనారాయణ, హెల్త్ అసిస్టెంట్ ఉమా మహేశ్వరరావు, ఆశ కార్యకర్తలు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నేత్ర శస్త్రచికిత్సకు తరలింపు



కురుపాం పీహెచ్‌సీ నుంచి కంటి ఆపరేషన్లకు విజయనగరం బయలుదేరిన రోగులు

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం, గుమ్మలక్ష్మీపురం మండలాల్లో ఇటీవల నిర్వహించిన నేత్ర వైద్య శిబిరాల్లో కంటి ఆపరేషన్లకు ఎంపికైన వారిని కురుపాం సామాజిక ఆరోగ్య కేంద్రం వద్ద నుంచి విజయనగరంలోని పుష్పగిరి కంటి ఆస్పత్రికి శుక్రవారం తరలించారు. ఉచితంగా శస్త్రచికిత్స చేయడంతో పాటు కళ్లద్దాలు, మందులు, రవాణా, భోజన సదుపాయాలు కల్పించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆరోగ్యమిత్ర సురేష్ తదితరులు పాల్గొన్నారు.